సాక్షి
శ్రీకాకుళం
బుధవారం | 4 | జనవరి | 2023



ఆలోచన మారింది..

రైతు ఆలోచన మారి ఆదాయం పెరిగింది. పువ్వులు, కూరగాయల సాగుతో ఆదాయం వస్తోంది. - 8లో



ఉపాధే లక్ష్యంగా..

ఉపాధే లక్ష్యంగా నైపుణ్య శిక్షణలు అందిస్తున్నారు. ఎచ్చెర్ల స్కిల్ కాలేజీలో ఇలా నాలుగు కోర్సులు ఉన్నాయి. - 8లో

స్కిల్ హబ్ సెంటర్ ప్రవేశానికి 7న స్క్రీనింగ్ టెస్ట్

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్వయ ఉపాధి శిక్షణా స్కిల్ హబ్ సెంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 7న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ తెలిపారు. ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండీషనర్, ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి హాజరు కావాలని కోరారు. వివరాలకు 9493290012 కు సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఆయా పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్టు, ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెదర్ ఇండస్ట్రీస్ జిల్లాకు దగ్గరలో ఉన్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలకు సంబంధించి అనుమతులు, రెన్యువల్స్‌పై సమీక్షించారు. విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో పాల్గొనాలని చెప్పారు. గ్రానైట్ యాజమాన్యాలకు ఒక్కో గ్రానైట్ కంపెనీకి ఎన్ని సర్వే రాళ్లు నిర్ణయించారో తెలుసుకోవాలని భూగర్భ గనుల శాఖ డీడీ ఫణిభూషణ్ రెడ్డిని ఆదేశించారు. ఇంతవరకు ఎన్ని సర్వే రాళ్లు సిద్ధంగా ఉన్నాయని జేసీ అడగ్గా, ఒక లక్ష 40 వేల సర్వే రాళ్లు సిద్ధంగా ఉన్నట్లు జేసీకి డీడీ వివరించారు. ఏపీఐఐసీ జెడ్ఎం యతిరాజు మాట్లాడుతూ భూ సమస్యల గురించి జేసీకి వివరించారు. జీఎం ఎ.సుధాకర్ మాట్లాడుతూ గత సమావేశంలోని విషయాలపై వివరించారు.

నేడు, రేపు జిల్లాస్థాయి శాప్ లీగ్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి శాప్ లీగ్ కబడ్డీ, వెయిట్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలకు రంగం సిద్ధమైంది. శాప్ ఆదేశాల మేరకు కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్లను ఈ నెల 4వ తేదీన కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్టు డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 85 కేజీల్లోపు బరువు ఉండాన్నారు. కబడ్డీ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు రూ.200 ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 8790595046 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వెయిట్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు ఈనెల 5వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి శ్రీకాకుళం రూరల్‌లోని పెద్దపాడు రెయ్యమ్మతల్లి వ్యాయామశాల జిమ్‌లో జరుగుతాయని తెలిపారు. అండర్–17 విభాగంలో 2005 డిసెంబర్ 31 తర్వాత జన్మించిన క్రీడాకారులు మాత్రమే ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ప్రవేశ రుసుం రూ.200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8,9 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి శాప్‌లీగ్ కబడ్డీ పోటీలకు అర్హత సాధిస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 99498 61168 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మార్కింగ్ ప్రకారం తొలగించారు



పోలీసుల సమక్షంలో జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డంకులు తొలగాయి. ఇటీవల కొంతమంది పచ్చ నాయకులు కావాలని అడ్డంకులు సృష్టించి పనుల జాప్యానికి కారకులు కావడంపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కొన్ని షాపులను మున్సిపల్ జేసీబీతో మంగళవారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాలరావు మాట్లాడుతూ పలాస ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు కాలువ, ఫుట్‌పాత్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. అధికారులు 80 అడుగుల విస్తీర్ణం నిమిత్తం కొలతలు ఇచ్చినప్పటికీ ఇంతవరకు కొంతమంది తొలగించలేదని, ఇటీవల కొందరు వాగ్వాదానికి దిగారని, ఇప్పుడు పోలీసుల సమక్షంలో తొలగించామని మరికొంతమంది ఆ పరిస్థితి తెచ్చుకోకుండా గడువు లోపల తొలగించుకోవాలని కోరారు. ఈ తొలగింపులో ఏఈ అవినాష్, కాశీబుగ్గ పోలీసులు, ఇంజనీరింగ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కరించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఫిబ్రవరి 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలు రకాల కేసుల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతాయన్నారు. ఈ తీర్పులపై అప్పీలుకు వెళ్లే అవకాశం కూడా లేకపోవడంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ లోక్ అదాలత్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కేంద్రంలోనే కాకుండా జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ నిర్వహిస్తామన్నారు.

అర్హతే కొలమానం..
అందుకే అభిమానం



వైఎస్సార్ పింఛన్ కానుక చెక్కును అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి తదితరులు

- పింఛన్ పెంపుతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు
- జిల్లాలో 3,17,901 మందికి లబ్ధి

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్హతే కొలమానంగా పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వం అందరి అభిమానాన్ని చూరగొంటోంది. ఈ నెల నుంచి పింఛన్ మొత్తాన్ని పెంచిన సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం రాజమండ్రి నుంచి వర్చువల్ విధానంలో నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ జిల్లాలో 3,17,901 మందికి రూ.86.11కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. జిల్లాలో ఈ నెల నుంచి కొత్తగా 9,346 మందికి రూ.2.60 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రశంసించారు. వలంటీర్ల ద్వారా టైముకు పెన్షన్ అందుతోందన్నారు.

- మాజీ ఉప ముఖ్యమంత్రి, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ విశాఖ రాజధానిని వ్యతిరేకిస్తున్న నేతలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు ఉత్తరాంధ్ర ద్రోహులని అన్నా రు. ప్రభుత్వం ప్రజలకు దగ్గరగా ఉంటూ పాలన సాగిస్తోందన్నారు. పెన్షన్ మొత్తాన్ని పెంచారని, విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారని, 17 వైద్య కళాశాలలు మంజూరు చేశారని గుర్తు చేశారు.
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ పాలనతో ఎందరికో మేలు జరుగుతోందన్నారు. గతంలో సిఫార్సులు ఉంటే తప్ప పనులు జరిగేవి కావని, ఇప్పుడు పేదరికమే అర్హతగా పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు.
- డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలంలో వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఇతర శాఖల అధికారులు, డీసీఎంఎస్ డైరెక్టర్ హేమమాలిని, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆనందమనిపించెను..!



దొంకూరుకు చెందిన ఈమె పేరు బదే కావేవి. మానసిక దివ్యాంగురాలు. తొలిసారిగా ఈ నెల పింఛన్ అందుకోవడంతో ఇలా సంబరపడిపోయింది.
- ఇచ్ఛాపురం రూరల్

గతంలో చాలాసార్లు అడిగాం..



వైఎస్సార్ పెన్షన్ కానుక మమ్మల్ని ఎంతో ఆదుకుంది. గతంలో పింఛను కోసం ఎన్నోసార్లు విన్నవించినా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం మాత్రం అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు అందిస్తోంది. జగన్ పది కాలాల పాటు సీఎంగా ఉండాలి.
– దూగాన అప్పారావు, పాత్రునివలస

జగనే సీఎం కావాలి



అన్ని పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి. జగనన్న నవరత్నాలతో ప్రజా రంజక పాలన సాగుతోంది. సీఎంగా జగనే ఎల్లకాలం ఉండాలి. మరింత మందిని పథకాల ద్వారా ఆదుకోవాలి.
– పొట్నూరు భారతీలక్ష్మి, విశాఖ బి కాలనీ, శ్రీకాకుళం

ధైర్యంగా బతుకుతున్నాం



నా భర్త పదేళ్ల కిందట మృతి చెందారు. ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఈ ప్రభుత్వం వచ్చాక పింఛను, అమ్మఒడి వంటి పథకాలతో ధైర్యంగా బతుకుతున్నాం. అప్పట్లో పింఛను కోసం అవస్థలు పడేవాళ్లం. వలంటీర్ల ద్వారా ఇంటికే పింఛను వస్తోంది. – నేతుల భవానీ, ఇందిరానగర్ కాలనీ

వలంటీర్లతో సమస్యలు మాయం



గతంలో పింఛను కోసం పాట్లు పడేవాళ్లం. వలంటీర్లు వచ్చాక ఆ అవస్థలు మాయమయ్యాయి. వైఎస్ జగనే మళ్లీ మళ్లీ సీఎం కావాలి. పెన్షన్ల కోసం గతంలో పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు వలంటీర్లు తలుపు తట్టి డబ్బులు ఇస్తున్నారు.
– అంధవరపు రామారావు, చాపురం

వేషధారణ భేష్



దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా అధికారులు, నాయకులు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. మందస మండలంలోని పొత్తంగి–సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థిని పిట్ట చార్మి సావిత్రి బాయి వేషధారణలో అందరినీ ఆకట్టుకుంది. – మందస

మేలుకొలుపు విని.. మీకు శుభమని



42 ఏళ్లుగా సాగుతున్న మేలుకొలుపు ఇది. కొత్తూరులో దశాబ్దాలుగా సాగుతున్న సంప్రదాయం ఈ ధనుర్మాసంలోనూ కనిపించింది. ఈ బృందం వేకువజామున ఇలా నగర సంకీర్తన చేస్తూ బియ్యం, నగదు సేకరిస్తారు. వీటితో అన్నదానాలు, ప్రవచనాలు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు.
– కొత్తూరు

గోమాత రుణం తీర్చుకున్నారు

- ఆవుకు పెద్ద కర్మ చేసిన రైతు



పొరుగింటి మహిళకు చీరను అందిస్తున్న బైరమ్మ



బైరమ్మ అల్లారుముద్దుగా పెంచుకున్న దేశీయపాడి ఆవు

కవిటి: ఆ ఇంట రెండు దశాబ్దాలుగా గోమాత తిరిగింది. ఇంటిల్లిపాదికీ పాలిచ్చి ఆదుకుంది. తొమ్మిది ఈతలు ఈనింది. పెద్ద కొడుకులా ఆర్థికంగా అండగా నిలిచింది. ఇన్నేళ్లుగా ఇంటిలో మనిషిలా కలిసిపోయిన గోమాలచ్చిమి పది రోజుల కిందట అందరినీ విడిచిపెట్టి వెళ్లిపోయింది. పొద్దున్న లేచింది మొదలు గోధూళి వేళ వరకు ఆవు పిలుపునకు అలవాటు పడిపోయిన ఆ రైతు కుటుంబ సభ్యులు ఈ ఎడబాటును భరించలేకపోయారు. ఇన్నేళ్ల సేవకు గుర్తుగా గోవుకు పెద్దకర్మ నిర్వహించారు. కవిటి మండలం ఆర్.బెలగాంకు చెందిన పి.బైరమ్మ తన ఇంటిలో 22 ఏళ్లుగా అపురూపంగా చూసుకుంటున్న ఆవు మృతి చెందడంతో శాస్త్రోక్తంగా దశ దిశ కర్మ నిర్వహించారు. 11 వ రోజున తమ ఊరిలో ఉన్న ఇరుగుపొరుగు వారిని పిలిచి 25 మంది మహిళలకు చీర జాకెట్లు, 25 మంది పురుషులకు తువ్వాళ్లు, లుంగీలు అందించారు. గోవు రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని తడికళ్లతో చెప్పారు.

స్పాట్ అడ్మిషన్ల నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా మంగళవారం పోస్టు గ్రాడ్యుయేషన్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు. ఈ ప్రవేశాలకు ఏపీ పీజీ సెట్‌లో ర్యాంకు తప్పనిసరి. జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన వర్తించకపోవటం, మొత్తం ఫీజు ఒకేసారి చెల్లించటం వంటి వాటి వల్ల స్పాట్‌కు ప్రవేశాలకు అరకొర స్పందన లభించింది. మొత్తం ఫీజు చెల్లించేందుకు ఆసక్తి గల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. బయోటెక్నాలజీలో 3, మైక్రోబయోలజీలో 3, ఎనలిటికల్ కెమిస్ట్రీలో ఒక్కరు చేరారు.

డ్వాక్రా బజార్.. స్టాళ్లు తయార్

- శ్రీకాకుళంలో డ్వాక్రా బజార్ ప్రారంభం
- ఆకర్షిస్తున్న స్టాళ్లు



జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



స్టాల్‌ను చూస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

డ్వాక్రా బజార్..



వేదిక	శ్రీకాకుళంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానం
వేళలు	ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు
ఎప్పటి వరకు	ఈ నెల 9వ తేదీ వరకు ప్రతి రోజూ


శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో డ్వాక్రా బజార్ సిద్ధమైంది. స్వయం సహాయక బృందాల్లోని మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారు. ఈ బజార్‌ను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. నాబార్డ్, యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ బజార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యంత్రాల వినియోగం వల్ల సంప్రదాయ చేతివృత్తులు దెబ్బ తిన్నాయని, అలాంటి వారికి చేయూత అందించాల్సి ఉందన్నారు. అందుకే డ్వాక్రా బజారు పేరిట మహిళలు, గిరిజనులు తయారుచేసిన వస్తువులన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి విక్రయించేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సంక్రాంతి రోజుల్లో జిల్లా నలుమూలల నుంచి నగరానికి జనం వస్తారని, వారికి వివిధ ప్రాంతాల వస్తువులు అందుబాటులో ఉండేలా డీఆర్‌డీఏ ఏర్పాట్లు చేసిందన్నారు. అనంతరం సీడాప్, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగమేళా గోడపత్రికను మంత్రి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మహిళా రైతు పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆరోగ్యం–ఆదాయం కార్యక్రమం పేరిట శ్రీకాకుళం మండలంలో 5వేల మందికి ఆరోగ్యాన్ని అందించేందుకు మునగ మొక్కలను మహిళలకు పంపిణీచేశారు. తొలుత సంప్రదాయం గురుకులం ఆధ్వర్యంలో లీలాకృష్ణ నృత్య బృందం చేసిన నృత్యాలు, సాయి విద్యామందిర్ విద్యార్థి తన్మయి చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మహిళా ఆర్థిక సంస్థ చైర్ పర్సన్ బి.హేమమాలిని రెడ్డి, పోలినాటి వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.కృష్ణవేణి, ఐటీడీఏ పథక అధికారి బి.నవ్య, నాబార్డ్ డీడీఎం వరప్రసాదరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యాసాగర్, మెప్మా పథక సంచాలకులు ఎం.కిరణ్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు, మైలపల్లి మహాలక్ష్మి, మండవిల్లి రవి, కామేశ్వరి, గొండు శారద, యామిజాల గాయత్రి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.కృష్ణవేణి, చల్లా అలివేలుమంగ, స్వచ్ఛంద సంస్థల సంచాలకులు ఎం.ప్రసాదరావు, ఎస్.సన్యాసిరావు, ఎస్.ఆశాదీపిక, సాంబమూర్తి, కోణార్క్ శ్రీను, ఇతర అధికారులు తదితరులు హాజరయ్యారు.

చెక్కటి ప్రవృత్తి

- అద్భుతమైన దారు శిల్పాలు తయారు చేస్తున్న షణ్ముఖరావు
- రైతు నుంచి కళాకారుడిగా మారిన వైనం
- శిల్పం చేస్తే అదుర్స్



పనిలో షణ్ముఖరావు



షణ్ముఖరావు చేసిన సీతారామలక్ష్మణ హనుమమూర్తులు



చెక్క శిల్పాలతయారీ కోసం ప్రత్యేకంగా చేయించిన పనిముట్లు

కవిటి: అతని చదువు పది. పని వ్యవసాయం. ఉద్యోగం కోసం ఎక్కడికో వలస వెళ్లారు. ఏవేవో పనులు చేశారు. కానీ భగవంతుడు ప్రసాదించిన కళ ఆయనకు ఉన్న ఊరిలోనే ఉపాధి చూపింది. ఉపాధి చూపించడమే కాదు కళాకారుల్లో ఆయనకు ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టింది. కవిటి మండలం డొంకపుట్టుగకు చెందిన గుప్పి షణ్ముఖరావు చెక్కపై శిల్పాలు(దారు శిల్పాలు) అద్భుతంగా తయారు చేస్తున్నారు. పొట్ట కూటి కోసం 1990లో ముంబై వెళ్లిపోయిన షణ్ముఖరావు అక్కడ జాతీయస్థాయిలో పేరుపొందిన గురువు రెనాల్డ్ సీక్వెరా వద్ద చెక్కశిల్పం(దారు శిల్పం)లో మెలకువలు నేర్చుకున్నారు. దశాబ్ద కాలం అక్కడే ఉండి వేలాది బొమ్మలు తయారు చేశారు. తర్వాత ఆరోగ్యం పాడవడంతో కవిటి మండలం సొంతూరుకు వచ్చేశారు. ఇక్కడే తనకున్న రెండున్నర ఎకరాల కొబ్బరితోటపై ఆధారపడి ప్రవృత్తి అయిన దారుశిల్పాల(చెక్కపై శిల్పం) తయారీలో ముందుకు సాగుతున్నారు.

'చెక్క'టి గిరాకీ

ఆయన ఎంచుకున్న ఈ చెక్కబొమ్మలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. దీన్ని అవకాశంగా ఎంచుకున్న షణ్ముఖరావు ఆనాటి నుంచి నేటివరకు వెను తిరిగిచూడలేదు. ప్రస్తుతం ఒక్కో బొమ్మ రూ.10,000 నుంచి రూ.3.5లక్షల వరకు ధర పలుకుతోంది. దేవతల విగ్రహాలు, బుద్ధుడు, జీసస్, లాఫింగ్ బుద్ధ, సింహం, పులి ఇలా కొనుగోలుదారుల కోరిక మేరకు బొమ్మల్ని చేసి ఇస్తున్నాడు. ఇప్పటి వరకు అత్యధికంగా 12 అడుగుల ఎత్తున్న శిల్పాల్ని కూడా చెక్కాడు.

గుమ్మడి, తెల్లజిల్లేడు కలపలతో..

ఈ వృత్తిలో శిల్పాలను చెక్కడానికి మంచి నాణ్యత కలిగిన చెక్క అవసరం. ఇందుకోసం గుమ్మడి కర్ర అధికంగా వినియోగిస్తున్నారు. అలాగే తెల్లజిల్లేడు చెక్కతో గణేషుని విగ్రహం పూజామందిరంలో ఉంటే ఎంతో శ్రేష్టమని భక్తుల విశ్వాసానికి తగ్గట్టుగా ఆ బొమ్మలు ఎక్కువగా చేసి ఇచ్చానని చెబుతున్నారు. ప్రభుత్వం అటవీశాఖ అనుమతితో చందనం కర్ర పై విగ్రహం కావాలంటే వారి సొంతంగా అనుమతిపత్రాలు సంబంధిత శాఖ ద్వారా ఇస్తే చేసి ఇవ్వగలుగుతానని అంటున్నారు.

అన్నీ తానే..

చెక్కను తీసుకున్న తర్వాత చిన్నపాటి ఉలి,సుత్తితో దానికి తుది రూపం తీసుకువచ్చిన తర్వాత దానికి నగిషీ పడతారు. ఇందుకోసం అన్ని పనులు ఆయనే స్వయంగా చేస్తారు. ఒక నెలలో మూడు నుంచి ఐదు వరకు చిన్నసైజు బొమ్మలు చేస్తున్నారు. పెద్ద బొమ్మలు అయితే మూడు నుంచి ఐదునెలల వ్యవధి పడుతుంది.

సీఎం పేషీలో బొమ్మ పెట్టాలి..



ఇప్పటి వరకు వేలాది బొమ్మల్ని చెక్కాను. కవిటి చింతామణి అమ్మవారి విగ్రహాన్ని అక్కడ ఉచితంగా చేసి పెట్టాను. అదేవిధంగా విశాఖపట్నంలో పెట్టే రాజధాని కేంద్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేషీలో నేను చేసిన తెలుగుతల్లి చెక్క బొమ్మ బహుమతిగా అందించాలన్నది నా కోరిక.
– గుప్పి షణ్ముఖరావు, డొంకపుట్టుగ, కవిటిమండలం

క్లుప్తంగా

నేడు కుస్తీ పోటీల క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున అంతర్ వర్సిటీ పోటీల్లో పాల్గొనే కుస్తీ క్రీడాకారుల ఎంపిక బుధవారం నిర్వహించనున్నట్లు వర్సిటీ స్పోర్ట్సు డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 79892 48994 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వలస మత్స్యకారుడు మృతి


వాసుపల్లి రామారావు(ఫైల్)

గార: మండలంలోని బలరాంపురం గ్రామానికి చెందిన వాసుపల్లి రామారావు (35) గుజరాత్ రాష్ట్రంలోని వీరావల్‌లో మంగళవారం మృతిచెందాడు. ఆరుగురు మత్స్యకారులతో కలిసి ఉదయం బోటులో చేపల వేటకు వెళ్లగా సముద్రంలో పడిపోయి మరణించాడని సమాచారం అందినట్లు అదే గ్రామానికి చెందిన జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు కోనాడ నర్సింహులు తెలిపారు. రామారావుకు భార్య కొర్లమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గరిష్ట వేతనం లక్ష్యంగా పనిచేయాలి


ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: గరిష్ట వేతనం లక్ష్యంగా ఉపాధి వేతనదారులు పనిచేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ చిట్టిరాజు అన్నారు. చిలకపాలెం, అల్లినగరం ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక సహాయకుల సూచనలు పాటిస్తూ సమయపాలన పాటిస్తే గరిష్ట వేతనం వస్తుందన్నారు. ఉదయం, మధ్యాహ్నం కనీసం ఆరు గంటలు పనిచేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి జాబ్‌కార్డు లబ్ధిదారునికి 100 రోజుల పని కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ శోభాదేవి, ఈసీ నారాయణమ్మ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం


చెక్ అందజేస్తున్న జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.అప్పలనాయుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు డెత్ రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కును జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు అందజేశారు. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ఉన్న అప్పలనాయుడు భౌతికకాయాన్ని మంగళవారం సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ కార్యదర్శి కె.రాధాకృష్ణ, జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆర్.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, కె.అప్పన్న, సీసీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ టి.రామారావు, బాలుడు, నాయుడు, చంద్రరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఉపాధే లక్ష్యంగా.. నైపుణ్య శిక్షణ

- ప్రైవేటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి లక్ష్యంగా ఉచిత శిక్షణ
- ఎచ్చెర్ల స్కిల్ కాలేజీలో అందుబాటులో నాలుగు కోర్సులు
- ఆసక్తి చూపుతున్న గ్రామీణ ప్రాంత అభ్యర్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలంటే మార్కులు ఒక్కటే ప్రామాణికం కాదు. నైపుణ్యాలు (స్కిల్స్) కూడా తప్పనిసరిగా ఉండాలి. సరైన వృత్తి నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రైవేట్ సంస్థలు ముందుకు రావటం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నైపుణ్య కల్పనలో భాగంగా ఎచ్చెర్లలో స్కిల్ కాలేజీని ప్రారంభించింది. ప్రస్తుతం నాలుగు రంగాల్లో నైపుణ్య శిక్షణలు కొనసాగిస్తోంది. శిక్షణ పూర్తయ్యాక ఉపాధి కల్పిస్తారు. నైపుణ్య కళాశాలలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన ప్రాజెక్టులో భాగంగా సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ సంస్థ యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తోంది. 10వ తరగతి నుంచి డిగ్రీ చదివిన యువతకు శిక్షణ అందిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న శిక్షణల్లో, మిగులు సీట్లలో సైతం అవకాశాలు కల్పించనున్నారు. 10వ తరగతి అర్హత శిక్షణకు వెలమల నాయుడు(ఫోన్:8919247297), డిగ్రీ అర్హత శిక్షణలకు ఆర్.కృష్ణారావు (ఫోన్:8247656581)లను సంప్రదించవచ్చు. శిక్షణ కాలంలో భోజన, వసతులు సైతం ఉచితంగా కల్పిస్తున్నారు.

పేషెంట్ రిలేషన్ అసోసియేట్..

- కార్పొరేట్ ఇతర ఆస్పత్రుల్లో శిక్షణ అనంతరం పేషెంట్ రిలేషన్ అసోసియేట్‌లుగా ఉద్యోగాలు కల్పిస్తారు.
- స్కిల్ కాలేజ్‌లో మొదటిసారి డిగ్రీ విద్యార్థుల కోసం ప్రారంభించిన శిక్షణ ఇది.
- బొల్లినేని మెడీస్కిల్స్ సంస్థ ఈ శిక్షణ నిర్వహిస్తోంది. 30 మంది బ్యాచ్‌తో డిసెంబర్ 1న ఈ శిక్షణ ప్రారంభించారు. మూడు నెలల శిక్షణ మార్చి మొదటి వారం నాటికి పూర్తవుతుంది. అనంతరం ప్లేస్‌మెంట్ కల్పిస్తారు.

ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్...

- కోర్సు వ్యవధి నాలుగు నెలలు. 35 మందితో డిసెంబర్ 28న శిక్షణ ప్రారంభించారు.
- బొల్లినేని మెడీస్కిల్స్ సంస్థ ఈ శిక్షణ ఇస్తోంది. నాలుగు నెలల శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ కల్పిస్తారు.
- శిక్షణలో అవయవాల ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సంబంధించి అవగాహన కల్పిస్తారు. రోగి, అవయవాల డోనర్లకు అనుసంధానకర్తలుగా ఉంటారు.
- పలు ఆస్పత్రుల్లో ఈ ఉద్యోగాలు కీలకం. ఉద్యోగ నైపుణ్యాలను పూర్తిస్థాయిలో కల్పిస్తారు. ఏప్రిల్ చివరి నాటికి ఈ శిక్షణ పూర్తవుతుంది. ఏపీ, పక్కన రాష్ట్రాల్లో ప్లేస్‌మెంట్లు లభిస్తాయి.


కుట్టుమిషన్ శిక్షణలో అభ్యర్థినులు

సీడాప్ రిటైల్ ట్రైనింగ్..

- శిక్షణ పూర్తిగా మహిళలకే పరిమితం.
- 10వ తరగతి ఉత్తీర్ణత అవసరం. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లుగా ఉద్యోగాలు కల్పిస్తారు.
- బ్యాచ్‌కు 35 మంది చొప్పున మూడు నెలలు శిక్షణ ఇస్తారు. అనంతరం షాపింగ్ మాల్స్‌లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారు.
- ప్రస్తుతం మాల్స్ సంస్కృతి పెరుగుతుండటంతో మహిళలకు ఉద్యోగాల కల్పనలో ప్రాధాన్యమిస్తున్నారు. డిసెంబర్ 22న ఈ శిక్షణ ప్రారంభించారు.

స్వీయింగ్ మిషన్ ఆపరేటర్..

- టైలరింగ్, ఫ్యాషన్ టెక్నాలజీలో మహిళలకు శిక్షణ అందించి అనంతరం వస్త్ర పరిశ్రమల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారు.
- 10వ తరగతి అర్హత ఉన్నవారికి మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారు. డిసెంబర్ 22న శిక్షణ ప్రారంభించారు.


కంప్యూటర్ శిక్షణలో ట్రాన్స్ ప్లేంట్ కోఆర్డినేటర్ శిక్షణలో అభ్యర్థులు

- అధునాతన టెక్నాలజీతో దుస్తులు కుట్టడంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ ఉద్యోగాలకు సైతం మంచి డిమాండ్ ఉంది. ప్రైవేటు కంపెనీలతో పాటు ఇంటి వద్ద సైతం టైలరింగ్ ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు.

స్వయం ఉపాధి లక్ష్యంగా..



స్వయం ఉపాధి లక్ష్యంతో కోర్సులో చేరాను. ఇంటి వద్ద స్వయం ఉపాధి పొందాలన్నది లక్ష్యం. ప్రస్తుతం మహిళలకు సంబంధించిన వస్త్రాలు కుట్టడం నేర్చుకుంటున్నాను. అధునాతన ఫ్యాషన్స్ తెలుసుకుంటున్నాను.

– వి.భవాని, స్వీయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణ అభ్యర్థిని, కంచరాం, పొందూరు మండలం

సద్వినియోగం చేసుకోవాలి



యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. స్కిల్ కాలేజీలో ఉపాధికి దోహదం చేసే కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రధానంగా గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాం. శిక్షణ, వసతి, భోజనం ఉచితంగా కల్పిస్తున్నాం.

– డాక్టర్ డి.వి.విద్యాసాగర్, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ

ఆలోచన మారింది.. ఆదాయం పెరిగింది!


పూశాం గ్రామం వద్ద బంతిపూల సాగు

- బంతి పూల సాగుతో అదనపు ఆదాయం
- పువ్వులు, కూరగాయల సాగుపైనా దృష్టి
- ఆదర్శంగా నిలుస్తున్న ఎల్.ఎన్.పేట మండల రైతులు

ఎల్ఎన్‌పేట : ఖరీఫ్ వరిచేను కోతలు పూర్తయ్యాక రైతులు రెండో పంటగా అపరాలు, మొక్క జొన్న, నువ్వు తదితర పంటలు సాగు చేస్తుంటారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికందాక దళారులు అడిగిన ధరకు అమ్ముకోవటం వల్ల పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో మూడు, నాలుగు నెలల తరువాత ఎప్పుడో పంట చేతికి అందివచ్చినప్పుడు అమ్ముకునే కంటే మార్కెట్‌లో నిత్యం గిరాకీ ఉన్న పంటలను పండిస్తే గిట్టుబాటు అవుతుందని ఎల్.ఎన్.పేట మండల రైతులు భావించారు. తురకపేట, పూశాం, చొర్లంగి, లక్ష్మీనర్సుపేట తదితర గ్రామాల్లో బంతిపూలు, కూరగాయల పంటలను పండిస్తూ అదనపు ఆదాయం సంపాదిస్తున్నారు. పూలు, కూరగాయలు వారంలో మూడు, నాలుగు సార్లు కోతకు వస్తున్నాయి. వీటిని అమ్ముకుంటే వారంలో నాలుగు సార్లు ఆదాయం చేతికి అందుతుంది. ఒకసారి కోతకు వచ్చిన తరువాత నీటి తడులు పెట్టి కొద్ది కొద్దిగా ఎరువులు వేసుకుంటే సుమారు మూడు నెలల వరకు పంట చేతికి అందుతునే ఉంది. ఆదాయం కూడా వస్తుండంతో అధిక శాతం మంది రైతులు పూలు, కూరగాయల సాగుపై దృష్టి సారిస్తున్నారు.

బంతిపూల సాగుతో ఆదాయం



ఈ ఏడాది ఎరువు, పసుపు రంగుల బంతిమొక్కలు వేశాం. బంతి పూలకు మార్కెట్లో ఈ ఏడాది ధర తగ్గినప్పటికీ పెట్టుబడికి తగిన ఆదాయం తెచ్చి పెట్టాయి. కిలో రూ.100 వరకు విక్రయించాం. ఈ ప్రాంతంలో సరైన మార్కెట్ సదుపాయం కల్పిస్తే మరింత లాభసాటిగా ఉంటుంది.

– శివ్వాల సుదర్శనరావు, రైతు, పూశాం, ఎల్.ఎన్.పేట మండలం

రకరకాల కూరల సాగు



పొలాన్ని మెత్తగా దుక్కి చేసిన తరువాత బాగా కుల్లిన గత్తం వేసి మరోసారి నీటి తడిపెట్టి పొలాన్ని మెత్తగా దుక్కి చేశాం. నీటి తడుల తర్వాత బెండ విత్తనాలు చల్లాం. ప్రస్తుతం వారంలో మూడు సార్లు బెండ కోతకు వస్తోంది. ఇదే పొలంలో ఒక మూలన బీర, మరోవైపు పొడవు చిక్కుడు, గట్టుల చుట్టూ ఆనప వేశాం.

– పైడి దాసు, రైతు, తురకపేట, ఎల్.ఎన్.పేట

పనిచేయని క్వారీల లీజు రద్దు

- అధికారులకు జేసీ నవీన్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పనిచేయని గ్రానైట్, క్వారీల్లో తక్షణమే పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో లీజు రద్దు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రానైట్, క్వారీ యజమానులతో లీజులపై సమీక్షించారు. ముందుగా గ్రానైట్ కంపెనీలు, క్వారీల స్థితిగతులపై భూగర్భగణుల శాఖ డీడీ ఫణిభూషణ్ రెడ్డిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెన్యూవల్స్ పెండింగ్‌లో ఉంటే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. లీజుదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్ నాయక్, భూగర్భ గనుల శాఖ ఏడీ బాలాజీనాయక్, ఉత్తరాంధ్ర గ్రానైట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాడ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన 108 సిబ్బంది


మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందిస్తున్న 108 ఉద్యోగులు

కాశీబుగ్గ: రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాస డివిజన్ 108 అంబులెన్సు సిబ్బంది మంగళవారం కలిశారు. 108 ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, టెర్మినేషన్ అయిన సిబ్బందిని తిరిగి తీసుకోవాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిబ్బంది తారక్, వెంకటరావు, మురళీమోహన్, కె.వి.రమణ, తిరుపతిరావు, నారాయణరావు, పాసాల సత్యం, పి.రాజేష్, శ్రీనివాసరావు, ఆనంద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	54,930–00
బంగారం(22క్యా. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం


లక్ష్మీనారాయణ (ఫైల్)

శ్రీకాకుళం రూరల్/నరసన్నపేట: సింగుపురం పరిధిలోని నీలం జ్యూట్ మిల్ సమీపంలో సర్వీసు రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట మండలం గుండవల్లిపేటకు చెందిన పంచిరెడ్డి లక్ష్మీనారాయణ (30) దుర్మరణం పాలయ్యాడు. ఈయన ఓ షోరూంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం కూడా విధులకు హాజరవుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మీనారాయణకు మూడు నెలల కిందటే వివాహం జరిగింది. సోదరుడు పంచిరెడ్డి గిరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లక్ష్మీనారాయణ మృతితో స్వగ్రామం గుండవల్లిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు రాములు, చిన్నమ్ముడు, భార్య లావణ్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

తామర పురుగుతో జాగ్రత్త


మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త విశాలాక్షి

రణస్థలం: మిరప పంటను నల్ల తామర పురుగు ఆశించడంతో పూత పిందెగా ఏర్పడకముందే రాలిపోతోందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సస్యరక్షణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విశాలాక్షి అన్నారు. రణస్థలం మండలం వి.ఎస్.పురంలో మిరప పంటలపై నిర్వహిస్తున్న ప్రయోగ క్షేత్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తామర పురుగు నివారణకు బవేరియా వంటి జీవ శిలీంద్ర పొడి మందులను లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున కలిపి మొక్క అంతటా తడిచేలా వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. రసాయన మందులపై పెట్టే ఖర్చు ఆదా అవడమే కాకుండా, పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు, సమన్వయకర్తలు బి.లక్ష్మీనరసింహమూర్తి, పి.రమణ, బి.భానుమూర్తి, జె.గోపాల్, రైతుమిత్రలు రెడ్డి గోవిందరావు, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు మంగళవారం తెలిపారు. ల్యాండ్ సర్వేయింగ్ (మూడు నెలలు), వెబ్ డిజైనింగ్ కోర్సు (నాలుగు నెలలు)లకు పదో తరగతి విద్యార్హత కాగా, రూ.6 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 94403 50315 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు వీరగున్నమ్మ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్

కాశీబుగ్గ: కాశీబుగ్గ హైస్కూల్ మైదానంలో బుధవారం సాయంత్రం వీరగున్నమ్మ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహిస్తున్నట్లు దర్శకుడు గూన అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి సీదిరి అప్పలరాజు హాజరవుతారని పేర్కొన్నారు.

8న షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

మందస: మందసలో ఈ నెల 8 నుంచి 10 వరకు జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు మహేంద్ర అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.10,001, రూ.7001 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 99494 46976, 7702439088 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖరీఫ్‌లో వరి పండించిన ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసి పూర్తి న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ధాన్యం కొనుగోలుపై మంగళవారం కలెక్టరేట్‌లో డయల్ యువర్ జేసీ కార్యక్రమం నిర్వహించారు. 18 మంది రైతులు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయగా అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాలో జమవుతాయని చెప్పారు. ఇప్పటికే రూ.161 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గన్నీలకు, ట్రాన్సుపోర్టు నగదు కూడా జమచేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం పి.జయంతి, డీఎస్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షలకు త్వరలో నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అఫిలియేషన్ డిగ్రీ కళాశాలల మొదటి సెమిస్టర్, వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల 5, 7 సెమిస్టర్ల పరీక్షలు నిర్వహణకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఎగ్జామినేషన్స్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ మేరకు పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. నోటిఫికేషన్ తర్వాత ఫీజుల స్వీకరణ ఉంటుందని చెప్పారు.

సావిత్రిబాయి పూలే సేవలు ఆదర్శనీయం


సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం పీఎన్ కాలనీ: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే సేవలు ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం, బహుజన సంఘాల నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పార్కు వద్ద సావిత్రిబాయి పూలే 192వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు, విగ్రహదాత బాడాన దేవభూషణరావు మాట్లాడుతూ మహిళా హక్కుల సాధనకు పూలే అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కంఠ వేణు, బహుజన ప్రజా గాయకులు ఉదయభాస్కర్, గుత్తు చిన్నారావు, మంగరాజు, కళ్ల వేణు, అనంతరావు, కోటి, రంగాజీ దేవ్, దేశళ్ల మల్లిబాబు, వాన కృష్ణచంద్ పాల్గొన్నారు.

– అసమానతలకు, వివక్షతకు కారణమైన ఆధిపత్య దోపిడీని రూపుమాపాలంటే సావిత్రిబాయి నడిపిన సామాజిక ఉద్యమాల స్ఫూర్తితో సమరశీల పోరాటాలు సాగించాలని పలు దళిత, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాశి గణేష్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో పూలే జయంతి నిర్వహించారు. ఏపీ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు మార్పు మల్లేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణవేణి, ఎస్.ఎన్.పి.ఎస్ జిల్లా అధ్యక్షుడు చిత్తిరి లక్ష్మణరావు తదితరులు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.